క్లుప్తంగా

'ఆదిత్య'లో నేడు, రేపు జాతీయ స్థాయి సదస్సు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో శుక్ర, శనివారాల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. కంప్యూటేషనల్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్ (కేర్–2024)పై రెండు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు రెండు రాష్ట్రాల నుంచి సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, సైంటిఫిక్ మోడల్స్ ప్రదర్శన, కల్చరల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని వివరించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

తుని: విద్యార్థులకు సంప్రదాయ పిండి వంటల తయారీపై స్థానిక శ్రీప్రకాష్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. పెరుమాళ్లపురం బెల్లంగారెలు, కాకినాడ గొట్టం కాజా, ఆత్రేయపురం పూతరేకులు, మాడుగుల హల్వా, బందరు లడ్డూ, హల్వా పిండి వంటల తయారీలో శిక్షణ ఇచ్చినట్టు శ్రీప్రకాష్ అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఏషియన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ వై.రాజేష్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి.రూప స్వర్ణకుమారి పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

కిర్లంపూడి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక ఉమావైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో గురువారం శాస్త్ర దీపాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ముద్రగడ గిరిబాబు, సిరి దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాస్త్ర దీపాలంకరణ ప్రారంభించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గోకవరం: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని 108 వాహన సిబ్బంది కోరారు. ఈ మేరకు గురువారం గోకవరంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సాయిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. 108ను ప్రభుత్వమే నిర్వహించాలని, వేతనాలను పెంచాలని, ఇంక్రిమెంట్లు, ఏరియర్లు, ఈఎల్ బకాయిలు చెల్లించాలని, 12 గంటల పని విధానాన్ని రద్దు చేసి ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పులపర్తి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

జగ్గంపేట: మండలంలోని రాజపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం మహిళల భద్రత, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళా చట్టాలు, వాటి ప్రయోజనాలను వివరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

గండేపల్లి: మండలంలోని సుబ్బయ్యమ్మపేటలో స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఇటీవల పునర్నిర్మించిన ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి విజయ గణపతి, అయ్యప్ప, కుమార స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, కె.లచ్చయ్యదొర, జగ్గంపేట మాజీ జెడ్పీటీసీ మారిశెట్టి భద్రం తదితరులు స్వామి వార్లను దర్శించుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని మంగళ, బుధవారాలు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలి

తుని: ప్రజలకు ఇబ్బందికరంగా మారనున్న స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని సీపీఎం తుని శాఖ కన్వీనర్ నక్కెళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు స్మార్ట్ మీటర్లు వేస్తోందన్నారు. ఈ ప్రీపెయిడ్ మీటర్లు వేయడం వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. విద్యుత్ సంస్థలు తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తుని తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు.

బూత్‌స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలి

ఏలేశ్వరం: బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట మంగరాజు సూచించారు. స్థానిక షిర్డీనగర్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అధ్యక్షతన గురువారం సంఘటన పర్వ్ (బూత్ స్థాయి ఎన్నికలు)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా 23 లక్షల పార్టీ సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. ఉపాధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో 15 వేలు, ఏలేశ్వరం మండలంలో 8 వేల సభ్యత్వ నమోదు చేశామన్నారు. అనంతరం పలువురికి పార్టీ సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కామినేని జయశ్రీ, కురాకుల రాజా, నల్ల బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీమాకు స్పందన కరవు

- వాతావరణ ఆధారిత బీమాపై ఆసక్తి చూపని రైతులు
- నియోజకవర్గంలో 8960 ఎకరాల్లో జీడి మామిడి సాగు
- పదుల సంఖ్య దాటని బీమా ప్రీమియం
- నేటితో ముగుస్తున్న గడువు

తుని రూరల్: వాతావరణ ఆధారిత ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై జీడి మామిడి రైతులు ఆసక్తి చూపడం లేదు. ఉద్యాన రైతులు ఈ బీమా పథకంలో చేరాలని ప్రభుత్వ పిలుపునిచ్చింది. అయినప్పటికీ జీడిమామిడి సాగుదారుల నుంచి కనీస స్పందన లభించలేదు. బీమా కంపెనీలు రబీ కాలానికి నిర్దేశించిన ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుంది.

40 గ్రామాల్లో సాగు

తుని నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో సుమారు 40 గ్రామాల్లో జీడిమామిడి తోటలు ఉన్నాయి. ఈ మండలాల్లో 6353 మంది రైతులు 8960 ఎకరాల్లో జీడి మామిడి సాగు చేస్తున్నారు. ఐదు శాతంగా ఎకరాకు రూ.1500 చొప్పున ప్రీమియం రైతులు చెల్లిస్తే వాతావరణ ఆధారిత నష్టపరిహారం రైతులు పొందవచ్చు. ఉద్యాన అధికారులు మూడు వారాలుగా క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించినా ఆశించిన ఫలితం దక్కలేదు. మూడు మండలాల్లో బీమా ప్రీమియం చెల్లించినవారి సంఖ్య వందకు చేరలేదు.

ప్రయోజనాలు ఇలా...

ప్రకృతి వైపరీత్యాలు, అధిక ఉష్ణోగ్రతలు, అల్ప ఉష్ణోగ్రతలు, ఈదురు గాలులు సంభవించినప్పుడు బీమా కంపెనీలు ప్రీమియం కట్టిన రైతులకు నష్టపరిహారాన్ని చెల్లిస్తాయి. ఏ కారణంతోనైన పంటకు నష్టం వాటిల్లితే బీమా పొందేందుకు ఇఫ్కోటోకియా సంస్థకు 72 గంటల్లో వివరాలు తెలియజేయాల్సి ఉంది. 22019–2024 మధ్య కాలంలో ఈ–క్రాప్ బుకింగ్‌తో పాటుగా బీమా ప్రీమియం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది. ఇప్పుడు రైతులు చెల్లించుకోవలసి వస్తోంది.

బీమా నమోదు ఇలా..

బీమా నమోదు చేసుకోవాలంటే భూమి పత్రాలు, కౌలు కార్డు ఉండాలి. పంట వేసినట్టు వీఏఏ, వీహెచ్ఏ జారీ చేసిన పత్రం. ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా నంబరుతో బీమా చేయించుకోవాలి.

బహుళ ప్రయోజనాలు

వాతావరణ ఆధారిత జీడిమామిడి తోటల బీమా రైతులకు ఎంతో ప్రయోజనం. ఇతర రాష్ట్రాలతో పోల్చితే మన రాష్ట్రంలో బీమా ప్రీమియం 50 శాతం తక్కువ. ఈ నెల 15తో ప్రీమియం చెల్లింపు గడువు ముగుస్తుంది. ఈ అవకాశాన్ని జీడిమామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– జి.విజయలక్ష్మి, హెచ్ఓ, తుని



జీడిమామిడి బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ విజయలక్ష్మి

తుని నియోజకవర్గంలో జీడిమామిడి సాగు వివరాలు

మండలం	గ్రామాల సంఖ్య	రైతుల సంఖ్య	సాగు విస్తీర్ణం
తుని	17	2559	3410
కోటనందూరు	15	3103	3561
తొండంగి	8	691	1989
మొత్తం	40	6353	8960

రాజయోగ సాధనతో సద్గుణాలు



ప్రత్తిపాడులో జ్యోతి వెలిగిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు: రాజయోగ సాధనతో మనసు స్వచ్ఛమవుతుందని, తద్వారా సద్గుణ వంతులుగా మారవచ్చని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రజనీ దీదీ అన్నారు. ప్రత్తిపాడులోని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు మామిడి తోటలో గురువారం బ్రహ్మకుమారీలు కార్తిక వన సమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, మినర్వా విద్యాసంస్థల ఫౌండర్ రమేష్‌రాజు జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ఆమె ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సద్గుణాలతో మనసును నిండుగా ఉంచుకోవాలన్నారు. దుర్గుణాలకు మనసులో స్థానం ఇవ్వకుడదన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా, ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. బ్రహ్మకుమారీలు తులసి, శ్రీదేవి, అరుణ, చంద్రకళ, సుశీల, లక్ష్మి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు జీపీడీపీపై శిక్షణ

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)పై పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు, డిజిటల్ అసిస్టెంట్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటనారాయణ మాట్లాడుతూ పల్లెల సమగ్రాభివృద్ధికి జీపీడీపీ ఎంతో కీలకమైనదన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని జీపీడీపీ తయారీపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జీపీడీపీ రూపకల్పన విధివిధానాలు, ప్రభుత్వ నిబంధనలపై శిక్షణ ఇచ్చారు. ఈఓపీఆర్డీ ఎస్.జయరామ్, ఏఓ చిన్నరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వి.నాగేశ్వరరావు, ఏపీఎం సూర్యకుమారి పాల్గొన్నారు.



కోటనందూరులో శిక్షణ పొందిన వారితో ఎంపీడీఓ వెంకటనారాయణ

అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

ప్రత్తిపాడు/ రౌతులపూడి : గ్రామాల్లో నిష్పక్షపాతంగా సర్వే చేసి గ్రామ అవసరాలు గుర్తించాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుమార్‌బాబు మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి వనరులు, ప్రభుత్వ నిధులకు అనుగుణంగా పంచాయతీ మండల పరిషత్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ఆదర్శవంతమైన ప్రణాళికలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కేవీవీ కాశీ విశ్వనాథం, ఏపీఎం వై.వెంకట్, ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమారస్వామి, ఎంఈఓ వి. రాజబాబు, జేఈ ఎం.సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. రౌతులపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం గ్రామస్థాయి సిబ్బందికి ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

శంఖవరం: గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఎంపీడీఓ శర్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.గాంధీ, డాక్టర్ సౌమ్యశ్రీ, జేఈ మురళి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలంటూ ధర్నా

ఏలేశ్వరం: రాష్ట్రంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ధరల పెంపుతో సామాన్యుడిపై పెనుభారం పడిందన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నేత పిల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, మహిళలు, దళితులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ప్రత్తిపాడులో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో నిత్యావరాల ధరలు భారీగా పెరిగాయని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలన్నారు. అనంతరం 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు అందజేశారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ఏలేశ్వరం/గండేపల్లి/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్ /జగ్గంపేట/కిర్లంపూడి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏలేశ్వరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో వారోత్సవాలను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, మహ్మాతాగాంధీ, సరస్వతీ దేవి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తకపఠనం అలవర్చుకోవాలన్నారు. పుస్తకపఠనం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్ పాల్గొన్నారు. గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయాధికారి కె.అశోక్ కుమార్ ప్రారంభించారు. తొలుత గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొండంగి మండలం పెరుమాళ్లపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ మెహర్, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కాకినాడ జిల్లా అధ్యక్షుడు పి.సుబ్బరాజు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు టి.రాము, పి.వి.కృష్ణారావు, జె.శ్రీనుబాబు, రాజశేఖర్ పాల్గొన్నారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సన్యాసి ఆధ్వర్యంలో వారోత్సవాలు ప్రారంభించారు. జగ్గంపేట గ్రంథాలయంలో విశ్రాంత ఉపాధ్యాయ సంఘ నాయకుడు చంద్రమౌళి వెంకటశాస్త్రి వారోత్సవాలను ప్రారంభించారు. విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. కిర్లంపూడి మండలంలోని కిర్లంపూడి, గెద్దనాపల్లి, వీరవరం గ్రంథాలయాల్లో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.



ఏలేశ్వరం గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అరబిందో ఫార్మా కంపెనీ వద్ద ఆందోళన

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం అరబిందో ఫార్మా కంపెనీ వద్ద గురువారం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. గ్రామంలోని మత్స్యకారులు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు కంపెనీ గేటు ముందు బైఠాయించి ఆందోళన చేశారు. కంపెనీ నుంచి వెలువడే కాలుష్యం వల్ల తమకు ఇబ్బంది కలుగుతోందని, కాలుష్య కారక ఫార్మా కంపెనీలు తమకు వద్దంటూ నినాదాలు చేశారు. స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి నెలకు రూ.20 వేలు ఇవ్వాలని, తీరప్రాంత గ్రామాల్లో రోడ్లు, డ్రైన్‌లు నిర్మించాలని, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. కంపెనీ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సై జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కంపెనీ ప్రతినిధులతో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. స్థానికుల డిమాండ్లను మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని ప్రతినిధులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



పెరుమాళ్లపురంలో అరబిందో ఫార్మా కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పోస్టల్ ఉద్యోగి మృతదేహం లభ్యం

దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా): దేవరాపల్లిలో రెండు రోజుల క్రితం అదృశ్యమైన చింతలపూడి పోస్టల్ ఉద్యోగి దాసరి సత్య ప్రవీణ్ (23) రైవాడ జలాశయంలో శవమై కనిపించాడు. జలాశయం గట్టుపై గురువారం ఉదయం అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు నీటిలో తేలిన మృతదేహాన్ని గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సత్య ప్రవీణ్ కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు అప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఉండటంతో అనుమానంతో వెంటనే అతడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. సత్య ప్రవీణ్ మృతదేహమేనని అతడి కుటుంబ సభ్యులు నిర్ధారించడంతో గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన లోవరాజు, సుధారాణి రెండో కుమారుడు దాసరి సత్య ప్రవీణ్. మూడేళ్ల క్రితం దేవరాపల్లి మండలం చింతలపూడి సబ్ పోస్టుమాస్టర్‌గా ఉద్యోగం రావడంతో దేవరాపల్లిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగా మంగళవారం కూడా ఉద్యోగానికి వెళ్లిన సత్య ప్రవీణ్ ఇంటికి తిరిగి వచ్చారు. మధ్యాహ్నం వాతావరణం చల్లబడటంతో రైవాడ జలాశయ సందర్శనకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ కాలు జారి జలాశయంలో పడి మృతి చెందాడని తండ్రి లోవరాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి

ఏలేశ్వరం: మొక్కలు పెంపకం, సంరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎస్.విజయబాబు సూచించారు. దేశ మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, సమితి ప్రతినిధులు అనసూరి నాగేశ్వరరావు, గోళ్ల నాగేశ్వరరావు, చలంచర్ల నాగేశ్వరరావు, నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయంలో తనిఖీలు

కోటనందూరు: స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ గురువారం తనిఖీ చేశారు. అపార్ స్థితిగతులు, నమోదులో ఇబ్బందులపై సిబ్బందిని ఆరా తీశారు. మండలంలో 5,827 మంది విద్యార్థులుండగా 4,380 మంది విద్యార్థులకు అపార్ రూపొందించినట్లు సిబ్బంది డీఈఓకు వివరించారు. ఈ నెల 20 నాటికి 100 శాతం విద్యార్థులకు అపార్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈఓ రామశేఖర్, సీఆర్పీ శేఖర్, సీఓ మణీష్, జిల్లా కార్యాలయ సిబ్బంది దయానంద్, భాగ్యరాజు పాల్గొన్నారు.



కోటనందూరులో సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

అపార్ నమోదు త్వరగా పూర్తిచేయాలి

రౌతులపూడి: ప్రతి విద్యార్థికి అపార్ నంబర్ జనరేట్ చేయాలని డీఈఓ పి.రమేష్ సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం జిల్లా పరిషత్ పాఠశాలల హెచ్ఎంలు, ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరు లోగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులందరికీ అపార్‌ను జనరేట్ చేయాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల రికార్డులను పరిశీలించారు. ఎంఈఓ–2 గాడి కొండబాబు ప్రధానోపాధ్యాయులు కోళ్ల రాంబాబు, చిట్టియ్య పాల్గొన్నారు.

బాలల పండుగ.. ఆనందం నిండుగ

- ఘనంగా జాతీయ బాలల దినోత్సవం
- పాఠశాలల్లో ఆటపాటలతో అలరించిన విద్యార్థులు
- మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళులు

ఏలేశ్వరం/తుని/ప్రత్తిపాడు/తునిరూరల్/శంఖవరం/ప్రత్తిపాడు రూరల్/జగ్గంపేట/కిర్లంపూడి: జాతీయ బాలల దినోత్సవాన్ని గురువారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాలు, చిత్రపటాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక, జ్ఞానపద నృత్యాలను అభినయించారు. ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఏలేశ్వరం మండలం యర్రవరం, తిరుమాలి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు సీఏస్‌సీ శిశుఆధార్ సెంటర్ ఈఎల్ఈ రమాప్రభ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుని పట్టణంలో పలు పాఠశాల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.



ప్రత్తిపాడులో జాతీయ నాయకుల వేషధారణల్లో ఆకట్టుకున్న చిన్నారులు

ప్రత్తిపాడు మండలంలో...

ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజాల చిట్టిబాబు, బొంగుళూరి మధుబాబు పండిట్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, న్యాయవాదులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు.

తుని మండలంలో...

తుని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈఓ పరవాడ గీతాదేవి ఆధ్వర్యంలోనూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.



తిరుమాలిలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చాచా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు వేషధారణల్లో అలరించారు. విద్యార్థులకు బిస్కెట్లు, కేకులను పంచారు.

శంఖవరం మండలంలో..

శంఖవరం మండలంలోని కత్తిపూడి రిఫరల్ స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిన్నారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినికి సత్కారం

బాలల దినోత్సవం సందర్భంగా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థిని పోకల దుర్గను ఉపాధ్యాయులు సత్కరించారు. సర్టిఫికెట్, మెమెంటో అందించి అభినందించారు. కిర్లంపూడి మండలంలో తామరాడ జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ప్రధానోపాధ్యాయుడు ఎల్. కృష్ణ బెలూన్స్ ఎగురవేసి బాలల దినోత్సవాన్ని ప్రారంభించారు. బాలబాలికలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



కత్తిపూడిలో ఆకట్టుకున్న విద్యార్థినుల వేషధారణలు



కొలిమేరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సంబరాలు

అలరించిన నృత్య ప్రదర్శనలు

తుని: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రంగం యువజనోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. స్థానిక రోటరీక్లబ్ భవనంలో నిర్వహించిన పోటీలకు వివిధ పాఠశాలలకు చెందన 50 బృందాలు పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతులుగా దీప్తి, భాను, ప్రమీల, శేషారత్నం వ్యవహరించారు. ప్రాథమిక పోటీల్లో ప్రతిభ చూపిన బృందాలకు ఈ నెల 22న ఫైనల్స్ నిర్వహిస్తారని యూత్ యాక్టివిటీస్ చైర్మన్ టి.నాగిరెడ్డి తెలిపారు. రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్.మంగరాజు, గౌరీశంకర్, డాక్టర్ పి.ప్రసాద్, వర్మ, వివేకానంద, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.



తునిలో ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

151 మందికి వైద్య పరీక్షలు

తుని: ప్రపంచ మధుమేహ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రోటరీ క్లబ్ సెంట్రల్, గురున్యూరో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 151 మందికి ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించినట్టు రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు చక్కా శ్రీధర్ తెలిపారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రోటరీక్లబ్ సెంట్రల్ కార్యదర్శి దండెం కృష్ణ, కోశాధికారి జూలూరి మురళీ, డాక్టర్లు గురుప్రసాద్, భగవాన్, శ్రీనివాస్, డి.రామకృష్ణ, సీతారాం, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.